సాక్షి
జగిత్యాల
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు.



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: అంజన్న సన్నిధిలో మంగళ వారం రద్దీ నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.0/23.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉం టుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బం దీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 12,400 మంది జనరల్, 2,142 మంది ఒకేష నల్ విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, ప్రతీ కేంద్రంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాల ని, 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. గ్రా మీణ ప్రాంతాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ వి ద్యాధికారి నారాయణ పాల్గొన్నారు.

జాబితా రూపొందించాలి

పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందిం చాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. అధికారులతో నిర్వహించిన సమావేశంలో మా ట్లాడారు. అర్హులందరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. స్వీప్ అధికారి నారాయణ, కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోరుట్ల: అంగన్ వాడీ టీచర్లు, వర్కర్ల సమస్య లను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు మంగళవారం విప్‌ను కలిసి తమ సమ స్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, సమ్మెకాలం జీతం,రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్, జీతాల పెంపు తదితర అంశాలపై వినతి పత్రం ఇచ్చారు. అంగన్ వాడీల సమస్యలు ఇప్పటికే అసెంబ్లీలో చర్చించామని, మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తా నని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

కొండమల్లన్న జాతరలో విప్

మేడిపల్లి(వేములవాడ): భీమారం మండలం కమ్మరిపేటలో జరుగుతున్న కొండమల్లన్న జాతర ఉత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓడ్యాడ్, మన్నెగూడెంలో మల్లన్న జాతర్లలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట రెబ్బాస్ మల్లయ్య, బీనవేని గంగరాజం, ముఖేష్, తిరు పతి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క - సారలమ్మ జాతరకు ముస్తాబు



ముస్తాబైన జాతర ప్రాంగణం

ధర్మపురి: పట్టణంలోని మోరోల్ల వాగు వద్ద నిర్వహించనున్న సమక్క సారలమ్మ జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వడ్డెర సం ఘం అధ్యక్షుడు ఒల్లెపు శంకర్‌రాజు ఆధ్వర్యం లో ఈనెల 21 నుంచి 23 వరకు జాతర ఉత్స వాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర భక్తులకు అన్ని వసతులు కల్పిస్తు న్నారు. జగిత్యాల, కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండ లం భూషణరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ తిరుపతి తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లోడ్ విషయంలో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరి పంటల సాగు సమయంలో విద్యుత్ సరఫరాలో అంత రాయం లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట కోరుట్ల ఏడీఈ రఘుపతి, ఏఈ జమీల్‌పాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు ఉన్నారు.

చైర్మన్‌గిరి.. ఆశావహుల గురి

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి తీవ్ర యత్నాలు
- మొదలైన క్యాంప్ రాజకీయాలు
- నిత్యం విందులు.. వినోదాలు



రామోజీ ఫిల్మ్‌సిటీలో కుటుంబ సభ్యులతో మహిళా కౌన్సిలర్లు



ఇటీవల ఎమ్మెల్సీ కవితను కలిసిన కౌన్సిలర్లు, పక్కన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పదవి ఆశిస్తున్న వారు కౌన్సిల ర్లను మచ్చిక చేసుకునేందుకు నిత్యం పార్టీలు ఇస్తు న్నారు. ఇందు కోసం రామోజీ ఫిల్మ్‌సిటీలో కౌన్సిలర్లు మకాం వేశారు. ఇటీవల ఇన్‌చార్జి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం, అది కాస్త వీగిపోవ డంతో వెంటనే చైర్‌పర్సన్ ఎన్నికకు లైన్ క్లియర్ కాగా, పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు పావులు కదుపుతున్నారు.

మొదటిసారి బీఆర్‌ఎస్ పాగా

2020లో జరిగిన జగిత్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. గతంలో ఎక్కువసార్లు కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోగా ప్రస్తుతం బీఆర్‌ఎస్ పాగా వేసింది. కొన్ని కారణాల వల్ల చైర్ పర్సన్ పదవికి బోగ శ్రావణి రాజీనామా చేయడం తో ఖాళీ ఏర్పడింది. ఈక్రమంలో కాంగ్రెస్ పార్టీకి 7 సీట్లు మాత్రమే ఉండటంతో వారు అవిశ్వాసానికి తెరలేపలేదు. బీఆర్‌ఎస్ పార్టీలోనే ముసలం పుట్టిం ది. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో పాటు, చైర్‌పర్సన్ పదవి దక్కించుకుందామని ప్రయత్నిం చారు. తాజాగా 28న ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వడంతో పదవి దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

పోటీలో ముగ్గురు

నిత్యం విందులు, వినోదాలతో కౌన్సిలర్లను మచ్చిక చేసుకునేందుకు చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న వారు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. చైర్‌పర్సన్ పదవి కోసం ముగ్గురు తీవ్రంగా పోటీపడుతున్నారు. ఇందులో ఒకరు ఇండిపెం డెంట్‌గా గెలుపొంది బీఆర్‌ఎస్‌లో చేరిన ఓ కౌన్సిలర్ ఏకంగా డబ్బులు సైతం పంచినట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. గతంలో పద్మ శాలి వర్గానికి చెందిన బోగ శ్రావణికి పదవి దక్క గా, అదే వర్గానికి చెందిన అడువాల జ్యోతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన సమిండ్ల వాణికి గతంలోనే చైర్‌పర్సన్ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు తెలిసింది. కానీ అప్పట్లో వీలు కాలేదు. తాజాగా చైర్‌పర్సన్ ఎన్నిక జరగనుండ టంతో తనకే ఇవ్వాలంటూ ఆమె కూడా పోటీప డుతున్నారు. ఈ ముగ్గురిలో చైర్‌పర్సన్ పదవి ఎవరికి దక్కనుందో వేచి చూడాల్సిందే. ఒకవేళ ఈ పదవి దక్కించుకున్నా 11 నెలలు మాత్రమే అధికారంలో ఉంటారు. తర్వాత మున్సిపల్ పదవి కాలం ముగియనుంది. అయితే, చైర్‌ప ర్సన్‌గా ఒక్కసారైనా ఉండాలన్న ఉత్సాహంతో ఆశావహులు యత్నాలు ముమ్మరం చేశారు. అం తేకాక బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపో వడం, కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో బీఆర్ ఎస్ కౌన్సిలర్లు కొంత నిరాశలోనే ఉన్నారు.

అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..

జగిత్యాల మున్సిపల్‌లో 30 సీట్లున్న బీఆర్‌ఎస్ పార్టీతో పాటు, మరికొంత మంది ఇండిపెండెంట్లు సైతం ఈ పార్టీలోనే చేరారు. చైర్‌పర్సన్ పదవి దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఉంది. అధిష్ఠానం మాత్రం ఇప్పటి వరకు ఎవరిని ఎన్నిక చేయాలన్నది మాత్రం గుట్టుగానే ఉంచింది. అధిష్ఠానం ఆశీస్సులు ఉన్నవారికే చైర్‌పర్సన్ పదవి దక్కే అవకాశాలున్నాయని సమాచారం. నియోజక వర్గ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సైతం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరిని చైర్‌పర్సన్ చేయాల న్నది అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఇప్పటికే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు కవిత, రమణ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది.

ఎన్నిక జరిగేనా..

జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగు తున్న శ్రీనివాస్‌పై ఇప్పటికే సొంతపార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం పెట్టారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జోక్యం చేసుకుని అవిశ్వాసం వీగిపోయేలా చేశారు. కాగా చైర్‌పర్సన్ ఎన్నిక జరిగితే ఎలాంటి పరిణామ లు ఉంటాయి, అసలు ఎన్నిక జరుగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 28న ఎన్నిక జరగకుంటే 29న ఎన్నిక చేసుకోవచ్చని ఎల క్షన్ కమిషన్ అవకాశం ఇచ్చింది.

జగిత్యాల రూరల్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

- ఈనెల 28న ఎన్నిక
- 24లోపు సభ్యులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు



జగిత్యాలరూరల్ ఎంపీడీవో కార్యాలయం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల మండల పరిషత్ అధ్యక్ష పదవి బీసీ జనరల్ కాగా, ఎంపీటీసీ గాజర్ల గంగారాం (చ ల్‌గల్) ఎంపీపీగా ఎన్నికయ్యారు. 2021 ఏప్రిల్ 29న ఆయన కరోనాతో మృతిచెందారు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీగా ఉన్న పాలెపు రాజేంద్రప్ర సాద్ (పొలాస) ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతు న్నారు. దీంతో ఎంపీపీ ఎన్నిక చేపట్టాలని, బీసీ అభ్యర్థికి పదవి కట్టబెట్టాలని పలుమార్లు సభ్యులు కోరినా పట్టించుకోలేదు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రె స్ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూరల్ ఎంపీపీ ఎన్నిక విషయమై రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. దీంతో ఎట్టకేలకు ఎన్నిక లు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నోటి ఫికేషన్ జారీ చేసింది.

16 మంది ఎంపీటీసీలు

జగిత్యాల రూరల్ మండల పరిషత్‌లో 16 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ మృతిచెంద డంతో ఒక చల్‌గల్ ఎంపీటీసీ స్థానం ఖాళీ ఏర్పడిం ది. జగిత్యాల రూరల్ ఎంపీపీ స్థానానికి ఈనెల 28న ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో ఎంపీటీసీ సభ్యులందరికీ ఈనెల 24లోపు నోటీసులు జారీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈనెల 28న ఉదయం 11 గంటలకు జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ ఎన్నిక జరగనుంది.

పదవి కోసం ప్రయత్నాలు

జగిత్యాల రూరల్ ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ జారీ కావడంతో బీసీ జనరల్ స్థానంలో గెలిచిన ఎంపీటీ సీలు పదవి దక్కించుకునేందుకు చక్రం తిప్పుతు న్నారు. రూరల్ మండలంలో మొత్తం 16 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, బీఆర్‌ఎస్ 11, కాంగ్రె స్ 4, బీజేపీ 1 ఉన్నారు. కాగా, కల్లెడ ఎంపీటీసీ సభ్యుడు పర్శరాంగౌడ్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఎంపీపీ కోసం పర్శరాం గౌడ్ (కల్లెడ), మహేశ్ (నర్సింగాపూర్) ప్రయత్నా లు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధర్మపురి నియోజకవర్గం అధికారులతో నిర్వహించిన సమా వేశంలో మాట్లాడారు. వేసవిలో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుం డా ముందస్తు ప్రణాళికలతో నీటి సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏ ప్రాం తాల్లో నీటి సమస్య ఉందో అక్కడ అవసరమైన బోరుబావులు ఏర్పాటు చేయాలని, భగీరథ పైప్ లైన్ లీకేజీలు ఉంటే సరిచేయాలన్నారు. బోర్లకు మ రమ్మతులు చేయించాలని సూచించారు. 78 గ్రామా లకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతు న్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు సూచించారని, వెం టనే అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆ దేశించారు. వైద్యాధికారులు నాణ్యమైన వైద్యసేవ లందించాలని, ధర్మపురిలో 30 పడకలు గల ఆస్ప త్రిలో 12 మంది డాక్టర్లు డెప్యూటేషన్‌పై పనిచేస్తు న్నారని పేర్కొన్నారు. అలాగే 50 పడకల మాతా శిశు సంక్షేమ ఆస్పత్రి భవన పనులు కొనసాగుతు న్నాయని, ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టు లను భర్తీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దివాకర, ఇంజినీరిం గ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కా ర్యాలయంలో ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యాన్ని నిజం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. గ్రామానికో నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు నెలకొల్పి దేశానికే ఆదర్శంగా నిలిచార న్నారు. గత ప్రభుత్వ హయాంలోని సంక్షేమ పథ కాలను కొనసాగిస్తూ నూతన ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు సమన్వయంతో ప్రజలంద రికీ అందేలా చూడాలన్నారు. పల్లెప్రకృతి కార్యక్ర మాన్ని నిరంతరం కొనసాగిస్తూ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శుల సహకారంతో గ్రా మాల్లో శానిటేషన్, పచ్చదనం పరిశుభ్రతకు ఎక్కు వ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డెప్యూటీ సీఈవో రఘువరణ్, డీఆర్డీవో సంపత్‌రావు తదిత రులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థికాభివృద్ధి



యూనిట్‌ను పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

జగిత్యాలరూరల్: జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు సెర్ప్ బ్యాంక్ లింకేజీ స్త్రీనిధి రుణాలతో యూనిట్లు నెలకొల్పుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తు న్నారని టీ సెర్ప్ ఏపీడీ సుధీర్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెం దిన సభ్యురాలు స్త్రీనిధి రుణాలు తీసుకుని పట్టణం లో ఏర్పాటు చేసిన యూనిట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ రుణాలతో పాటు, స్త్రీనిధి రుణాలు అందజే స్తుండటంతో ఆర్థికంగా ఎంతో నిలదొక్కుకుంటు న్నారని వివరించారు. ప్రభుత్వం మరిన్ని యూని ట్లు నెలకొల్పుకునేందుకు రుణాలు ఇచ్చేందుకు సి ద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్స రంలో జిల్లాలో బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబం ధించి ఇప్పటికే 98 శాతం ప్రగతి సాధించడం జ రిగిందన్నారు. అలాగే తీసుకున్న రుణాల చెల్లింపు లో 99 శాతంతో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానం లో ఉందని, ఇందులో సెర్ప్ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీ సీ విద్యాసాగర్, వీవోఏ మమత, లత పాల్గొన్నారు.

అంకురార్పణ.. ధ్వజారోహణం



అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసిం హస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వ హించారు. సోమవారం రాత్రి ఊరేగింపు సేవలో భాగంగా స్వామివారు, అమ్మవారు కొండ దిగి పల్లకిలో బీర్‌పూర్, నర్సింహులపల్లె గ్రామాల్లో విహరిం చి మంగళవారం ఉదయం 7 గంటలకు తిరిగి కొం డపైకి చేరారు. అనంతరం ఆలయ అర్చకులు అర్చ నలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను పూర్తి చేశారు. బుధవారం రాత్రి 8గంటలకు స్వామివారి కల్యాణం జరగనుంది. కల్యాణానికి సుమారు 50 వేల మంది భక్తులు హాజరవుతారని ఆలయ చైర్మన్ అల్లకొండ సామ్రాట్, ఎంపీపీ మస ర్తి రమేశ్ పేర్కొన్నారు. అలాగే భక్తులకు ఇబ్బందు లు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

గురుకులం నుంచి విద్యార్థి పరార్

వెల్గటూర్(ధర్మపురి): మండలంలోని స్తంభంపల్లి గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి పారిపోయిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాఠశాల నుం చి విద్యార్థి పారిపోయి 3 గంటల తర్వాత ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు మాత్రం తమ కుమారుడిని కొట్టడంతోనే భయం తో ఇంటికి పారిపోయి వచ్చినట్లు చెబుతుండగా, ప్రిన్సిపాల్ మాత్రం పాఠశాలలో అలాంటి ఘటన ఏమీ జరగలేదని, కేవలం ఇంటిమీద బెంగతోనే పారిపోయినట్లు చెబుతున్నారు. సదరు విద్యార్థికి కౌన్సెలింగ్ ఇస్తామని పేర్కొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి



సంఘ సభ్యులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. రాయికల్ మండలం బోర్నపల్లిలోని చెలుకగూడెం, గొండుగూడెం గొండువారికి కమ్యూ నిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించగా మంగళవారం ఎమ్మెల్సీని గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లా ల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం కిష్టంపే టలోని రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో బోర్నపల్లికి చెందిన నాయకులు కొడిపల్లి ఆంజనేయులు, లక్ష్మణ్, సత్యం, పెంద్రం కాశీరాం, ఆత్రం లక్ష్మణ్, తుకారం , రాంబాబు, మధుకర్, సంఘ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పద్మనాయక కల్యాణ మండపంలో పరీక్షలకు సం బంధించిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించవ ద్దన్నారు. ఈసారి సైన్స్ సబ్జెక్ట్‌కు సంబంధించి భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం పేపర్లు విడి విడిగా ఉంటాయని వివరించారు.

విజ్ఞానాన్ని నేర్చుకోవాలి

విద్యార్థి దశ నుంచే విజ్ఞానాన్ని నేర్చుకోవాలని, జ్ఞానాన్ని నిత్య జీవితంలో వినియోగించుకోవాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్, బయాలోజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతీ విద్యార్థి అబ్దుల్ కలాం, సీవీ రామన్, శాస్త్రవేత్తల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనం తరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిం చారు. తాటిపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థి బి.వైష్ణవి మొదటి బహుమతి గెలుచుకుంది. అనంతరం కొత్త గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఎఫ్‌టీఎస్‌టీ ఫోరం అధ్యక్షుడు మచ్చ శంకర్, జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ పాల్గొన్నారు.

సీనియర్లకు మొండిచేయి?

'జిల్లా కేంద్రంలో ఇటీవల పదో తరగతి పరీక్షల విధులకు కేటాయిం పులో వివక్ష చోటుచేసుకుందని ఆరోప ణలు వస్తున్నాయి. కోరుట్ల నియోజకవ ర్గంలో పనిచేసే ఓ సీనియర్ ప్రధానోపా ధ్యాయుడికి పదో తరగతి విధులు కేటాయించకుండా అదే నియోజకవర్గం లోని ఓ జూనియర్‌కు కేటాయించారు. దీంతో ఆ ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.'

- పదో తరగతి పరీక్షల విధుల కేటాయింపులో వివక్ష
- ఆందోళనలో సీనియర్ ఉపాధ్యాయులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు




జగిత్యాల: పదో తరగతి పరీక్షలకు జిల్లాలో ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరగనున్నాయి. 67 కేం ద్రాలు ఏర్పాటు చేయగా, 67 మంది చీఫ్ సూపరిం టెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 67 మంది అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, న లుగురు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, 702 మంది ఇన్విజిలే టర్లను నియమించారు. వీరితో పాటు 22 మంది వాహన ఇన్‌చార్జీలు, కస్టోడియన్లను ఏర్పాటు చేశారు.

ఇష్టానుసారంగా..

విధుల కేటాయింపులో కొంత మంది సీనియర్ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీజీ హెచ్‌ఎం స్థాయిలో ఉన్నప్పటికీ తమకు పదో తరగ తికి చెందిన విధులను కేటాయించకుండా జూనియ ర్లకు కేటాయించారని, తమపై వివక్ష చూపుతున్నా రని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో పదో తరగతి పరీక్ష విధులు కేటాయించే విషయం లో పలు సంఘాల నాయకులు చెప్పిన వారికే అధికారులు కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సీనియర్ ఉపాధ్యాయులకు మాత్రమే పదో తరగతి విధులు కేటాయించారు. కానీ ఈసారి కొందరు సీనియర్లను కాదని జూనియ ర్లకు కేటాయించడం పట్ల సీనియర్లను అవమానిం చినట్లేనని భావిస్తున్నారు. నిబంధనల ప్రకారం సీనియర్లు, జూనియర్లు అంటూ లేదని, ఎవరిని నియమించుకోవాలనే నిర్ణయం విద్యాశాఖ అధి కారులకు ఉంటుంది. కానీ పలు సంఘాల నాయకు లు పైరవీలు చేయడం వల్లే సీనియర్లకు మొండి చేయి చూపారని, విధుల కేటాయింపులో నిర్లక్ష్యం ఉందని, వెంటనే మార్చాలని పలువురు సీనియర్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. కొందరు ఏకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు సీనియర్లు తమకు వద్దన్నప్పుడే జూనియర్లకు కేటాయించాలని, అలా కాకుండా జిల్లాలో ఇష్టాను సారంగా కేటాయింపులు చేశారని పలువురు సంఘ నాయకులు పేర్కొంటున్నారు.

ఎలాంటి వివక్ష లేదు

విధుల కేటాయింపులో సీనియర్, జూనియర్ నిబంధన లేదు. ఎవరైనా అప్పీలు చేసుకుం టే మళ్లీ వారికి కేటాయించేలా చూస్తాం. ఇం దులో ఎలాంటి వివక్ష లేదు. పైరవీలు సైతం లేవు. - జగన్మోహన్‌రెడ్డి, డీఈవో



చిన్న విమానం.. ప్రజల అభిమానం

జగిత్యాలరూరల్: చిన్న విమానం గ్రామాలు, అటవీ ప్రాంతాల మీదుగా చెక్కర్లు కొట్టడం తో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మంగళ వారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు 2 గంటల వరకు జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట, కల్లెడ, సోమన్‌పల్లి, హబ్సీపూర్, ధర్మపురి మండలం నేరెళ్ల, చిన్నా పూర్, సారంగాపూర్ మండలం అర్పపల్లి, అటవీ ప్రాంతాల్లో 8-10 సార్లు చిన్నపాటి విమానం తక్కువ ఎత్తులో చెక్కర్లు కొట్టింది.

క్లుప్తంగా

రాజన్న సేవలో సినీ దర్శకుడు జయశంకర్


ఆలయంలో కుటుంబసభ్యులతో జయశంకర్

వేములవాడ: వేములవాడ రాజన్నను సినీ దర్శకుడు జయశంకర్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. జయశంకర్ ప్రస్తుతం నటుడు సాయికుమార్‌తో అరి మూవీని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో ప్రముఖ నటి, యాంకర్ అనసూయ నటిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి రిమాండ్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట గ్రామపంచాయతీలో 2022–23లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సయ్యద్ మజీద్‌ను ఉద్దేశపూర్వకంగా రికార్డులు తారుమారు చేసిన కేసులో మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. డబ్బులకు ఆశపడి ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి మోసం చేయాలనే ఉద్దేశంతో ఇంటినంబర్ 4–1–100కి అదనంగా 4–1–100/1గా ఇచ్చారని తెలిపారు. లేని నంబర్‌ను సృష్టించి, రికార్డులు తారుమారు చేసిన కేసులో పంచాయత కార్యదర్శిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై వివరించారు.

మంత్రిపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): సోషల్ మీడియాలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై తప్పుడు ప్రచారం చేసిన ఓ వ్యక్తి కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు రామన్నపల్లిలో జరిగిన ఘటనలో మంత్రి ప్రమేయం ఉన్నట్లు జక్కె ప్రేమ్ సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. కాంగ్రెస్ నాయకుడు సాయిని రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఎవరూ పోస్టింగ్‌లు పెట్టొద్దని, తప్పుడు ప్రచారం చేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విజిలెన్స్ జిల్లా అధికారి బాధ్యతలు స్వీకరణ

కరీంనగర్‌క్రైం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారిగా అచ్చేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ అడిషనల్ ఎస్పీగా పని చేసిన ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన రమణారెడ్డి హైదరాబాద్ నార్కోటిక్స్ బ్యూరోకు వెళ్లారు.

బూడిదే మిగిలింది

- కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం
- ఆహుతైన 21 గుడిసెలు
- నిరాశ్రయులైన నిరుపేద కూలీలు
- 3 బైకులు, 6 సిలిండర్లు దగ్ధం
- సమ్మక్క జాతరకు వెళ్లిన బాధిత కుటుంబాలు
- ప్రమాదానికి కారణాలపై కొనసాగుతున్న విచారణ

"వారంతా నిరుపేదలు.. గుడిసెలు వేసుకొని కూలీ పనులు చేసుకుంటూ చాలా ఏళ్లుగా నివాసముంటున్నారు.. మంగళవారం వేకువజామున మేడారం సమ్మక్క జాతరకు బయలుదేరారు.. వెళ్లిన కొద్ది గంటల్లోనే వారి గుడిసెలు కాలిబూడిదైనాయి. సర్వం మంటల్లో కాలిపోవడంతో పాటు నిలువ నీడలేక నిరాశ్రయులయ్యారు. బూడిదే మిగిలిందంటూ విలపించారు."


విషణ్ణవదనంలో బాధిత కుటుంబ సభ్యులు


కాలిబూడిదైన గుడిసెలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ నగరంలోని ఆదర్శనగర్‌లో నిరుపేద కూలీల పూరి గుడిసెలు అగ్నికి బూడిదపాలైనాయి. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో మంటలు అంటుకుని గుడిసెల్లోని సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున ఒకదానికొకటి మొత్తం 21 గుడిసెలు అంటుకొని చూస్తుండగానే కాలిబూడిదైనాయి. స్థానికులు 10.50 గంటలకు ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయడంతో వెంటనే చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 3 గంటల పాటు ఫైర్ సిబ్బంది శ్రమించారు. ఫైరింజన్ నీటితో పాటు అదనంగా మరో మోటారును మున్సిపల్ ట్యాంకర్లకు బిగించి మంటలు ఆర్పేందుకు యత్నించారు. ఘటన సమయంలో గుడిసెల్లో బాధితులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలోకి మంటలు వ్యాపిస్తుండగా ఫైర్, ఆసుపత్రి సిబ్బంది అదుపు చేశారు. కరీంనగర్ త్రీటౌన్ సీఐ శ్రీనివాస్‌తో పాటు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూడా అక్కడే ఉండి పర్యవేక్షించారు.

పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల

ఆదర్శనగర్‌లో పూరి గుడిసెలు కాలిపోయాయన్న సమాచారం అందుకున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు వచ్చి పరిశీలించారు. ఫైర్ అధికారులకు పలు సూచనలు చేశారు. బాధితులను ఆదుకుంటామని తెలిపారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సమ్మక్క దర్శనానికి..

గుడిసెల్లో ఉండే కూలీలందరూ మంగళవారం వేకువజామున మేడారం జాతరకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. జాతరకు వెళ్లడానికి ముందు పెట్టిన దీపం కారణంగా ఒక గుడిసె అంటుకొని అందులోని సిలిండర్ పేలడంతో మిగతా వాటికి వ్యాపించి ఉంటుందని స్థానికులు, ఫైర్ అధికారులు అనుమానిస్తున్నారు. బట్టుల రాంబాబు, చల్ల తిరుమలయ్య, చల్ల రమేశ్, గుంజ రమేశ్, బట్టుల కృష్ణ, కుంచం తిరుమలేశ్, వేముల రాములు, వేముల నాగరాజు, వేముల ఎల్లయ్య, అలకుంట నర్సయ్య, చల్ల వెంకటేశ్, బట్టుల రాంప్రసాద్, గోగుల యాదయ్య, కుంచపు శివ, వేముల శ్రీను, ఒర్సు శ్రీను, వేముల ఉప్పలయ్య, గుర్రం కుమార్, మక్కల శ్రీను, బట్టుల వెంకన్న, ఒర్సు కృష్ణ పూరి గుడిసెలు కాలిపోయినట్లు ఫైర్ అధికారులు వెల్లడించారు. గుడిసెల్లో ఉన్న టీవీలు, మూడు బైక్‌లు, 6 సిలిండర్లు, నిత్యవసర సామగ్రి కాలిబూడిదైనాయి.

ప్రమాదంపై అనుమానాలు?

పూరిగుడిసెల్లో నివాసముంటున్న కూలీలందరూ మేడారం వెళ్లగా, ఎవరూ లేనప్పుడు అగ్నిప్రమాదం జరగడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీపం వల్ల మంటలు అంటుకున్నాయని కొందరు.. ఎవరైనా కావాలని చేశారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ప్రైవేటు భూమిలో గుడిసెలు వేసుకొని ఉంటున్న వీరిని ఖాళీ చేయించేందుకు ఇలాంటి ఘటనకు ఒడిగట్టారా అనే వాదనలు ఘటన స్థలం వద్ద వినిపించాయి.

గుండెలవిసేలా రోదనలు

సుమారు 25 ఏళ్ల క్రితం బాధితులు మహబూబాబాద్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కరీంనగర్ ఆదర్శనగర్‌లోని ప్రైవేట్ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు.

– 36 కుటుంబాలు కలుపుకొని మొత్తం 150 మంది వరకు నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా చాలా మంది నెల క్రితమే వారి స్వగ్రామాలకు చేరుకొని అక్కడి నుంచి మేడారం వెళ్లిపోయారు.

– మంగళవారం కేవలం అక్కడ నివసించే కూలీల్లో బత్తుల రాంబాబు, బత్తుల కృష్ణ కుటుంబ సభ్యులు మాత్రమే ఉదయం 9 గంటలకు వెళ్లారు. వారు హుజూరాబాద్ దాటగానే ప్రమాదం గురించి తెలుసుకొని వెనుతిరిగారు. ఘటన స్థలం వద్దకు చేరుకోగానే నిలువ నీడలేకుండా పోయిందని కన్నీరుమున్నీరుగా విలపించారు.

సూత్తుండగానే అంటుకున్నయ్



మా గుడిసెలు కాలిపోయినప్పుడు నేను ఇంట్లోనే ఉన్నా. మొదట వాసన, పెద్ద శబ్దాలు వచ్చినయ్. అవతలకి వచ్చి సూసేసరికి గుడిసెలు అంటుకున్నయి. మా ఇంట్లో డబ్బు, బంగారం, టీవీ అన్ని అంటుకున్నయి.

– చల్ల లక్ష్మి, బాధితురాలు

వస్తువులు కాలిపోయినయ్



మేము మేడారం వెళ్తుండగా హుజూరాబాద్ దాటినంక ఫోన్ వచ్చింది. ఇక్కడికి వచ్చి చూసేసరికి మొత్తం కాలిపోయినయి. రోడ్డు మీద బతుకులయినయ్. సర్కారోళ్లు మమ్మల్ని ఆదుకొని ఇళ్లు కట్టియ్యాలే.

– బత్తుల ఎల్లమ్మ, బాధితురాలు

స్కూటీ కాలిపోయింది



మంటలు అంటుకొని మా ఇళ్లన్నీ కాలిపోయినవి. ఇంట్లో ఉన్న 30 వేలు, 4 తులాల బంగారం, వస్తువులన్నీ బూడిదైనయ్. స్కూటీ కూడా కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గుంజ రమేశ్, బాధితుడు

భూ మాఫియా కుట్ర



ఆదర్శనగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం కచ్చితంగా భూమాఫియా కుట్రలో భాగమే. కూలీల కుటుంబాలు మేడారం పోవడం చూసి కావాలనే కొందరు వ్యక్తులు నిప్పంటిచారు. ఇప్పటికే గుడిసెలు ఖాళీ చేయాలని వీరిని పలువురు వ్యక్తులు మాస్కులు పెట్టుకొని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఇరువర్గాల వ్యక్తులు వచ్చి భూమి మాదంటే మాది అంటున్నారని కూలీలు చెబుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులను శిక్షించాలి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మార్వాడి సుదర్శన్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

శిశువు అపహరణపై అధికారుల సీరియస్

- ఎంసీహెచ్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు?

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో ఆదివారం శిశువు అపహరణ ఘటనను ఆస్పత్రి అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేసిన సిబ్బందిని గుర్తించి, షోకాజ్ నోటీసులిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. శిశువును అపహరించిన మహిళ చాలాసేపు దవాఖానాలోనే తిరిగినప్పటికీ ఇటు నర్సింగ్ సిబ్బంది గానీ, అటు సెక్యూరిటీ సిబ్బంది గానీ గుర్తించకపోవడంతో ఎంసీహెచ్‌లో భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనకు మొత్తం 11 మంది సిబ్బందిని బాధ్యులుగా తేల్చినట్లు తెలిసింది. వీరికి నేడో, రేపో షోకాజ్ నోటీసులు అందజేయనున్నట్లు సమాచారం.

'ఆర్‌బీవీఆర్‌ఆర్' న్యాయ సలహాదారు ఎన్నిక


మహేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి విజ్ఞాన పరిషత్ (రెడ్డి సంక్షేమ సంఘం) ఉమ్మడి జిల్లా న్యాయ సలహాదారుగా కరీంనగర్ కోర్టు న్యాయవాది బేతి మహేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి తెలిపారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన కార్యవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

'గృహజ్యోతి' ఫేక్ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

- టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): గృహజ్యోతి పథకం అమలులో భాగంగా సెల్‌ఫోన్లకు వస్తున్న ఫేక్‌లింక్‌లను ఓపెన్ చేయొద్దని టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ గంగాధర్ ఒక ప్రకటనలో కోరారు. ఇంటింటికీ సర్వే చేస్తున్నందున వివరాలు తీసుకోవడంలో జాప్యం అవుతోందన్నారు. విద్యుత్ శాఖ నుంచి https:tsnpdcl.in/Menu/j2s/LinkAadharMobile లింక్ పంపించినట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. దీన్ని ఓపెన్ చేయడం, ఓటీపీ పంపించడం వంటి చేయొద్దని సూచించారు. ఇది విద్యుత్ సంస్థ రూపొందించిన లింక్ కాదని, సంస్థ సిబ్బందికి మాత్రమే వివరాలివ్వాలని పేర్కొన్నారు.

'శాతవాహన'కు రూ.20 కోట్లు మంజూరు


ప్రధాని నరేంద్ర మోదీతో వీసీలో పాల్గొన్న వీసీ మల్లేశ్, అధికారులు

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీకి రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ తెలిపారు. మంగళవారం దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల వీసీలు, అధికారులతో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వీసీతోపాటు రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 78 విశ్వవిద్యాలయాల అభివృద్ధికి, ప్రాజెక్టులు, పరిశోధనల కోసం నిధుల ఈ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీకి యూజీసీ, 12(బీ) హోదా వచ్చినందునే నిధులు కేటాయించారని తెలిపారు. న్యాక్ గ్రేడింగ్ ఉంటే రూ.100 కోట్లు వరకు మంజూరయ్యేవన్నారు. రూ.20 కోట్లలో రూ.10 కోట్లు భవనాలకు, రూ.6 కోట్లు నూతన అవిష్కరణలకు, రూ.4 కోట్లు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కోసం వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, శాతవాహన పూర్వ వీసీలకు, రిజిస్ట్రార్లకు, రాజకీయ నాయకులకు, యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి కార్మికుల ధర్నా



కరీంనగర్‌టౌన్: రెండు నెలలుగా వేతనాలివ్వడం లేదు.. కాంట్రాక్టు సంస్థ పట్టించుకోవడం లేదంటూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేతనాలివ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. జీవో నంబర్ 306 ప్రకారం రూ.16 వేల వేతనం ఇవ్వాలని కోరారు. కరీంనగర్ ఆస్పత్రిలో 2 నెలలుగా, హుజూరాబాద్ దవాఖానాలో 4 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇంటి అద్దె, నిత్యావసర సరుకులకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేతనాల కోసం కాంట్రాక్టర్‌తో మాట్లాడితే 2023 జూలై నుంచి ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వడం లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. పీఎఫ్ రూ.3 వేలు కాకుండా రూ.800 మాత్రమే కట్ చేస్తున్నారని తెలిపారు. రెండు జతల యూనిఫాంతోపాటు తమకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు శేఖర్, అధ్యక్షుడు పి.అరుణ్, ఉపాధ్యక్షురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్ దాతృత్వం

- అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేత


సరుకులు అందిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఆదర్శనగర్‌లో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలపై ఎంపీ బండి సంజయ్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం రాత్రి స్థానిక బీజేపీ నాయకుల ద్వారా వారికి వంట పాత్రలు, నిత్యావసర సరుకులను అందించారు. గుడిసెలు దగ్ధమై, నిలువ నీడ లేని ఆ కుటుంబాలకు అండగా నిలవాలని, వారికి ఇంటి సదుపాయం కలిగే వరకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం సమకూర్చాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాస సత్యనారాయణ, దుబాల శ్రీనివాస్, గుగ్గిళ్లపు రమేశ్, రాపర్తి ప్రసాద్, కటకం లోకేశ్, దురుశెట్టి సంపత్, ఎం డీ.ముజీబ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, అనిల్, ప్రసన్న, అవుదుర్తి శ్రీనివాస్, శివరాజ్, బషీర్, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, రాపర్తి విజయ, పెద్దపెల్లి జితేందర్, నాగ సముద్రం ప్రవీణ్, మునిగంటి కుమార్, బండారు గాయత్రి, బల్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క ఎఫెక్ట్.. రాజన్నకు రూ.1.77 కోట్ల ఆదాయం


ఆదాయం లెక్కిస్తున్న శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది

వేములవాడ: వేములవాడ రాజన్న దర్శనానికి గత నెల రోజులుగా సమ్మక్క భక్తులు తరలివస్తున్నారు. ఈక్రమంలో గత 13 రోజుల్లో భక్తుల ద్వారా రూ.1.77కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య మంగళవారం హుండీలలోని నగదు లెక్కించారు. 283 గ్రాముల బంగారం, 11.300 కిలోల వెండి సమకూరినట్లు ఈవో తెలిపారు.

వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన అనుశ్రీ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం రాత్రి చిన్నారి మేకల అనుశ్రీపై వీధికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా అటుగా వచ్చిన వీధికుక్కలు ఒక్కసారిగా లోనికి ప్రవేశించి దాడిచేశాయి. ఇంట్లో ఆడుకుంటున్న తమ బిడ్డను కుక్కలు ఇంట్లోకి చొరబడి దాడి చేసి కరిచాయని తండ్రి మేకల సదానందం ఆవేదన చెందాడు. బాలికను గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి వీధికుక్కల బారినుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలి


మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

కరీంనగర్: రెండో విడత గొర్రెల పంపిణీలో డీడీలు కట్టిన గొల్ల కురుమలకు నగదు బదిలీ త్వరగా చేయాలని గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కోశాధికారి కాల్వ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులున్నారు.

క్రికెట్ విజేత 'ఎస్సార్‌ఆర్'



కరీంనగర్ స్పోర్ట్స్: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అండర్ గ్రౌండ్ క్రికెట్ పోటీల్లో కరీంనగర్ ఎస్సార్‌ఆర్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలతో జరిగిన మ్యాచ్‌లో 83 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్రీడాకారులను ఎస్సార్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పీడీ నాగేశ్వరరావు అభినందించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


రమేశ్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని పోచంపేటకు చెందిన మత్స్యకారుడు తోపారపు రమేశ్ (48) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. ఎస్‌హెచ్‌వో రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రమేశ్ వృత్తిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చేపలు పట్టడానికి మండలంలోని కోనాపూర్ పెద్ద చెరువుకు వెళ్లాడు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో తెప్ప బోల్తా పడి నీటిలో పడిపోయాడు. నీటిలో తామర, ఇతర ఆకుల తీగలు అతడికి చుట్టుకోవడంతో నీటి నుంచి బయటకు రాలేకపోయాడు. ఉదయం 11 గంటలు అవుతున్నా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన రమేశ్ భార్య లత చెరువు వద్దకు వెళ్లింది. అక్కడ చెప్పులు, బట్టలను గమనించి తోటి మత్స్యకారులకు విషయం వివరించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో గాలించి రమేశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రెన్యువల్ కాని ఆస్పత్రులపై చర్య తీసుకోండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: జిల్లాలో రెన్యువల్ కాని ప్రైవేటు ఆస్పత్రులపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేశ్, తిరుపతి కోరారు. పలువురు ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి, స్థానికంగా డాక్టర్లు లేకున్నా సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహిస్తూ అడ్డగోలు ఫీజుల ద్వారా పేదలను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, వినతిపత్రం అందించారు. జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ లేకపోవడం, నిజ నిర్ధారణ కమిటీలు వేయకపోవడం వల్ల ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి తనిఖీలు చేపట్టేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.లక్‌పతి, నాయకుడు ప్రేమ్‌చంద్, గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

'భగీరథ' నీళ్లు రావడం లేదని ట్యాంకు ఎక్కిన యువకుడు


యువకుడితో మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

ధర్మారం(ధర్మపురి): రెండు రోజులుగా తమకు మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లి తండా(బి) గ్రామానికి చెందిన అజ్మీర రవినాయక్ మంగళవారం భగీరథ వాటర్ ట్యాంకు పైకెక్కి నిరసన తెలిపాడు. సమాచారం అందుకున్న ఎస్సై సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుమలత వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో యువకుడు ట్యాంకు దిగివచ్చాడు. ఈసందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ, తమ తండాకు భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, దీంతో తాగునీరు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నాడు. పంచాయతీ కార్యదర్శికి చాలాసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, విధిలేని పరిస్థితిలో ట్యాంక్ ఎక్కానని వివరించాడు. పంచాయతీ కార్యదర్శి సుమలత మాట్లాడుతూ, లంబాడితండా(బి) గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న తండాకు ప్రత్యేకంగా ట్యాంకు ఉందని పేర్కొన్నారు. ట్యాంకు వద్ద గేట్‌వాల్వ్ తెరుస్తున్న తండావాసులు.. తాగునీటిని పట్టుకున్నాక మూసివేయడం లేదని, దీంతో ట్యాంకులోని నీరు వృథాగా పోయి ఇలాంటి సమస్య తలెత్తుతోందని తెలిపారు. రోజూ సక్రమంగా తాగునీరు సరఫరా చేస్తున్నామని వివరించారు. అయినా, ఇప్పుడు తలెత్తిన సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ

- నలుగురికి గాయాలు
- ఒకరిపై దాడి
- ఇరువర్గాలపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదానికి కారణంగా ఆరోపిస్తూ ఓ ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులతో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాలు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లికి చెందిన శివరాత్రి బాలకృష్ణ తన బైక్‌పై బావ కృష్ణంరాజు, సోదరి లక్ష్మిలతో కలిసి రెండో బైపాస్‌లో వెళ్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లికి చెందిన మందాటి శ్రీశైలం బైక్‌పై ఎదురుగా వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ప్రమాదానికి శ్రీశైలం కారణమని ఆరోపిస్తూ.. మరో వాహనంపై ఉన్న ముగ్గురు దాడి చేశారు. పరస్పర ఫిర్యాదులతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



చల్లంగ చూడు పోచమ్మతల్లీ

వేములవాడ: రాజన్నకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు మంగళవారం వేకువజామునుంచే బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు నెత్తిన బోనాలతో పందిళ్ల కింద గంటలతరబడి వేచిచూశారు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద మురుగు చేరిపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు.